## ఆకట్టుకున్న ఇండియన్ బ్యాంక్

న్యూఢిల్లీ, జనవరి 24: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.2,119 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ బ్యాంక్. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,396 కోట్లతో పోలిస్తే 52 శాతం వృద్ధిని సాధించింది. సమీకృత ఆదాయం పెరగడం, మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. క్రితం ఏడాది రూ.13,551 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికంలో రూ.16,099 కోట్లకు చేరుకున్నట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. దీంట్లో వడ్డీల మీదనే రూ.14,198 కోట్ల ఆదాయం సమకూరాయి. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 6.53 శాతం నుంచి 4.47 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ కూడా 1 శాతం నుంచి 0.53 శాతానికి దిగొచ్చాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ నిధుల కేటాయింపులు రూ.1,474 కోట్ల నుంచి రూ.906 కోట్లకు తగ్గాయి.

Reliance digital

## రిలయన్స్ డిజిటల్ రిపబ్లిక్ డే ఆఫర్లు

హైదరాబాద్, జనవరి 24: గణతంత్ర దినోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని రిలయన్స్ డిజిటల్.. 'డిజిటల్ ఇండియా సేల్' ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 28 వరకు అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద బ్యాంకుల కార్డులపై రూ.26 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ పొందవచ్చునని తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్లు టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ల్యాప్‌టాప్‌లు, వాషింగ్ మెషిన్లతోపాటు ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలను తగ్గింపు ధరలో విక్రయిస్తున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్లలో భాగంగా 55 అంగుళాల గూగుల్ క్యూలెడ్ టీవీ ప్రారంభ ధర రూ.34,990, 75 అంగుళాల యూహెచ్‌డీ గూగుల్ టీవీ ప్రారంభ ధర రూ.66,990కి లభించనున్నది. ఈ టీవీలపై రెండేండ్ల వ్యారెంటీ కూడా కల్పిస్తున్నది.

## వివిఫై 620 కోట్ల నిధుల సేకరణ

హైదరాబాద్, జనవరి 24: హైదరాబాద్‌కు చెందిన ఫిన్‌టెక్ ఎన్‌బీఎఫ్‌సీ వివిఫై ఇండియా ఫైనాన్స్ లిమిటెడ్..సిరీస్ బీ ఫండింగ్‌లో భాగంగా 75 మిలియన్ డాలర్లు(రూ.620 కోట్లు) నిధులను సమీకరించింది. ఈ సందర్భంగా కంపెనీ వ్యవస్థాపకుడు అనిల్ పినపాల మాట్లాడుతూ..వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి అమెరికా ఇన్వెస్టర్ల నుంచి ఈ నిధులను సమీకరించినట్లు చెప్పారు. గడిచిన ఏడాదిలో 5 లక్షల కస్టమర్లకు రూ.1,000 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం 800 మంది సిబ్బంది ఉండగా, వచ్చే ఏడాదిన్నరలోగా ఈ సంఖ్యను 2 వేలకు పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.166 కోట్ల ఆదాయంపై రూ.16 కోట్ల లాభాన్ని గడించింది. ఈ ఏడాది ఆదాయం రెండింతలు పెరిగే అవకాశం ఉందన్న ఆయన..రూ.3 వేల కోట్ల రుణాలను మంజూరు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు.

## ఐవోసీ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, జనవరి 24: దేశీయ చమురు దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ముడి క్రూడాయిల్ ధరలు పెరిగినప్పటికీ గత త్రైమాసికానికిగాను సంస్థ రూ.8,063.39 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే కాలానికి సంస్థ రూ.448.01 కోట్ల లాభం మాత్రమే గడించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన రూ.12,967 కట్లో కంటే చాలా తక్కువగా నమోదైంది. కంపెనీ ఆదాయం రూ.2.28 లక్షల కోట్ల నుంచి రూ.2.23 లక్షల కోట్లకు పడిపోయింది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో ప్రతి బ్యారెల్ క్రూడాయిల్‌ను శుద్ధి చేయడంతో సంస్థకు 13.26 డాలర్ల ఆదాయం సమకూరింది.

## బజాజ్ లాభం 2 వేల కోట్లు


న్యూఢిల్లీ, జనవరి 24: బజాజ్ ఆటో రూ.2,032.62 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది మూడో త్రైమాసికంలో నమోదైన రూ.1,472.7 కోట్ల నికర లాభంతో పోలిస్తే 38 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.9,318.54 కోట్ల నుంచి రూ.12,165.33 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది.

# ద్రవ్యోల్బణం, లేఆఫ్స్‌పై ఆందోళన

### 57 శాతంమంది పట్టణవాసుల బాధ ఇదే

### కాంటర్ ఇండియా బడ్జెట్ సర్వే






ముంబై, జనవరి 24: ద్రవ్యోల్బణం పెరగడం, ఉద్యోగం భద్రంగా ఉంటుందో లేదో అన్న ఆందోళనలు పట్టణవాసుల్లో అధికమయ్యాయని అంతర్జాతీయ మార్కెటింగ్ డేటా, బిజినెస్ అనలిటిక్స్ సంస్థ కాంటర్ పేర్కొంది. 2024-25 సంవత్సరానికి మధ్యంతర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కాంటర్ ఇండియా కేంద్ర బడ్జెట్ సర్వేను బుధవారం విడుదల చేసింది. ఎన్నికల సంవత్సరం అయినందున ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం స్పందిస్తుందన్న అంచనాలు సర్వేలో వ్యక్తమయ్యాయని, ద్రవ్యోల్బణం అదుపునకు కఠిన చర్యలు చేపడుతుందని, ఆదాయపు పన్నుల్లో ఊరట లభిస్తుందని పట్టణవాసులు భావిస్తున్నారని కాంటర్ దక్షిణాసియా డివిజన్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ దీపేందర్ రాణా చెప్పారు. సర్వే వివరాలు...

- సర్వేలో పాల్గొన్నవారిలో 57 శాతం మంది పెరుగుతున్న ద్రవ్యోల్బణం పట్ల ఆందోళన చెందుతున్నామన్నారు. 2023లో 27 శాతం మందే ధరలపట్ల ఆందోళన వ్యక్తంచేశారు.
- గత ఏడాదితో పోలిస్తే ధరల పోటు అధిక శాతం ప్రజల్ని బాధిస్తున్నదని సర్వే వెల్లడించింది. మరోవైపు ఉద్యోగ భద్రతపై కూడా భయాలు పెరిగిపోయాయి.
- ప్రతీ ముగ్గురిలో ఒకరు లేఆఫ్స్ జరుగుతాయన్న ఆందోళనలో ఉన్నారని సర్వే పేర్కొంది.
- ఇక అంతర్జాతీయ అంశాలైన ఆర్థిక మాంద్యం భయం 48 శాతం మందిని, రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు 45 శాతం మందిని ఆందోళనపరుస్తున్నాయి.
- వివిధ రకాల భయాలున్నప్పటికీ, అధిక శాతం భారత్ ఆర్థికాభివృద్ధి పట్ల ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.
- దేశంలోని 16 ప్రధాన నగరాల్లో 21-55 వయసు మధ్యగల 2,500మంది వినియోగదారులతో ఈ సర్వే నిర్వహించారు. ఇందులో ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు, వ్యాపారస్తులు ఉన్నారు.
- కేంద్ర బడ్జెట్ నుంచి ఆశిస్తున్న వరాలు, అంచనాలపై వినియోగదారుల అభిప్రాయాల్ని సేకరించే లక్ష్యంతో సర్వే కొనసాగింది.
- బేసిక్ ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచుతారని, స్టాండర్డ్ డిడెక్షన్‌ను రూ. 50,000 నుంచి 1,00,000కు చేరుస్తారన్న అంచనాలు వ్యక్తమయ్యాయి.
- హయ్యర్ టాక్స్ శ్లాబ్‌ను రూ. 15 లక్షలకు సవరించాలని, ఆపైన ఆదాయం ఉన్నవారం పన్ను రేటును 30 శాతం నుంచి తగ్గించాలని వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు ఆశిస్తున్నారు.
- మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై సెక్షన్ 80 కింద డిడెక్షన్ పరిమితులు పెంచుతారన్న అంచనాల్ని వ్యక్తం చేశారు.
- సెక్షన్ 80సీ కింద మదుపు సాధనాలపై టాక్స్ రిబేట్ పెంపుదలను 70 శాతం మంది వినియోగదారులు కోరుతున్నారు.

## టెక్ మహీంద్రాకు టెలికం దెబ్బ

- 61 శాతం క్షీణించిన లాభం



న్యూఢిల్లీ, జనవరి 24: దేశీయ ఐటీ కంపెనీ టెక్ మహీంద్రాకు కీలక రంగమైన టెలికం వెర్టికల్ నుంచి ఆదాయం గణనీయంగా తగ్గడంతో నిరుత్సాహక ఫలితాలు వెల్లడించింది. 2023-24 క్యూ3లో కంపెనీ లాభం అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 61 శాతం క్షీణించి రూ.510 కోట్లకు తగ్గింది. ఆదాయం సైతం 5 శాతం తగ్గుదలతో రూ.13,101 కోట్ల వద్ద నిలిచింది. మార్కెట్ అంచనాలకంటే లాభం తగ్గినప్పటికీ, ఆదాయం పెరిగింది. అలాగే క్యూ2తో పోలిస్తే ఆదాయం 3.2 శాతం, నికరలాభం 1.8 శాతం చొప్పున మెరుగుపడింది. అయితే కంపెనీ సాధించిన కొత్త కాంట్రాక్టులు క్యూ2కంటే క్యూ3లో 640 మిలియన్ డాలర్ల నుంచి 381 మిలియన్ డాలర్లకు తగ్గాయి. టెక్ మహీంద్రాకు అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే టెలికం, మీడియా వెర్టికల్స్ ఆదాయం 2022-23 క్యూ3తో పోలిస్తే 13.4 శాతం పడిపోయింది. త్రైమాసికంవారీగా ఈ తగ్గుదల 0.3 శాతం. టెక్నాలజీ వెర్టికల్ ఆదాయం 3 శాతం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసుల వెర్టికల్ ఆదాయం 8 శాతం చొప్పున తగ్గాయి. 2023 డిసెంబర్ క్వార్టర్‌తో పోలిస్తే ఇబిటా మార్జిన్ 12 శాతం నుంచి 5.4 శాతానికి క్షీణించగా, త్రైమాసికంవారిగా 70 బేసిస్ పాయింట్ల మేర పెరిగింది. కంపెనీ నగదు నిల్వలు రూ.6,515 కోట్ల నుంచి రూ.7,012 కోట్లకు పెరిగాయి.

### క్యాంపస్‌లకు వెళ్తాం

ఇతర ఐటీ కంపెనీల్లానే టెక్ మహీంద్రా నుంచి కూడా ఉద్యోగుల వలసలు తగ్గాయి. క్యూ3లో వలసల రేటు 10 శాతానికి దిగింది. క్యూ2లో ఇది 11 శాతం. కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య కూడా 4 వేలకుపైగా తగ్గి 1,46,250కు చేరింది. బీపీఎం విభాగం కార్యకలాపాలు తగ్గినందున, ఉద్యోగుల సంఖ్యలో తగ్గుదల ఏర్పడిందని కంపెనీ కొత్త సీఈవో మిలింద్ జోషి చెప్పారు. ఈ ఏడాది కంపెనీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు జరుపుతుందని, ఫ్రెషర్స్‌ను తీసుకుంటామని వెల్లడించారు.

## తెలంగాణ రెరా భేష్

### హిమాచల్ ప్రదేశ్ రెరా చైర్మెన్ డా శ్రీకాంత్ బాల్ది

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని క్రమబద్ధీకరించడంతోపాటు పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన రెరా చట్టం భేష్‌గ్గా ఉన్నదని హిమాచల్‌ప్రదేశ్ రెరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథార్టీ) చైర్మన్ డా శ్రీకాంత్ బాల్ది అన్నారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా తెలంగాణ రెరా కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రెరా కార్యాలయంలోని అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై తెలంగాణలో రెరా చట్టం అమలు తీరుతెన్నులు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్, ఏజెంట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రెరా చైర్మన్ ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ..ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పక్షం రోజుల్లోనే పూర్తి చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలోని ఇతర నగరాలైన కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం తదితర నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం పారదర్శకతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

## మైక్రోసాఫ్ట్ @ 3 ట్రిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ, జనవరి 24: గ్లోబల్ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ తొలిసారిగా 3 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ప్రపంచంలో 3 ట్రిలియన్ డాలర్ల విలువకు చేరిన తొలి కంపెనీ ఐఫోన్ తయారీ కంపెనీ యాపిల్‌కాగా, మైక్రోసాఫ్ట్ తాజాగా ఈ ఫీట్ సాధించింది. బుధవారం రాత్రి యూఎస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మైక్రోసాఫ్ట్ షేరు విలువ 403.78 డాలర్ల వద్దకు పెరగడంతో మార్కెట్ విలువ 3 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకుంది. గత ఏడాది యాపిల్ ఈ స్థాయిని చేరిన తొలికంపెనీగా చరిత్ర సృష్టించింది. తాజాగా యాపిల్ మార్కెట్ విలువ 3.03 ట్రిలియన్ డాలర్ల సమీపంలో ఉన్నది.

# కోలుకున్న స్టాక్ మార్కెట్లు

- నష్టాల నుంచి లాభాల వైపు సూచీల పయనం
- సెన్సెక్స్ 690, నిఫ్టీ 215 పాయింట్లు వృద్ధి
- ఆకట్టుకున్న మెటల్, కమోడిటీ షేర్లు



ముంబై, జనవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. వరుస నష్టాల నుంచి తేరుకుని బుధవారం లాభాలను అందుకున్నాయి. మెటల్, కమోడిటీ, టెలికం షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 689.76 పాయింట్లు లేదా 0.98 శాతం పుంజుకొని 71వేల స్థాయికి ఎగువన 71,060.31 వద్ద ముగిసింది. అయితే ఒకానొక దశలో 71,149.61 పాయింట్ల స్థాయికి ఎగిసిన సూచీ.. మరో దశలో 70,001.60 పాయింట్లకు పడిపోయింది. నిజానికి ఉదయం ఆరంభంలో మార్కెట్లు నష్టాల్లోనే మొదలయ్యాయి. సెన్సెక్స్ 316.75 పాయింట్లు క్షీణించింది. కానీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ నుంచి పెట్టుబడుల వైపు మళ్లడంతో పరిస్థితి మెరుగైంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 215.15 పాయింట్లు లేదా 1.01 శాతం ఎగబాకి 21,453.95 వద్ద స్థిరపడింది. ఉదయం 60.70 పాయింట్లు కోల్పోయింది.

### సెన్సెక్స్ షేర్లలో..

టాటా స్టీల్ 3.77 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 3.62 శాతం చొప్పున లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్ 3.60 శాతం, పవర్‌గ్రిడ్ 3.34 శాతం చొప్పున పెరగగా, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యునీలివర్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లూ పెరిగాయి. మంగళవారం భారీగా నష్టపోయిన జీ షేర్లు 6.70 శాతం పెరిగాయి. రంగాలవారీగా మెటల్ సూచీ 3.57 శాతం, టెలీకమ్యూనికేషన్స్ 3.21 శాతం, చమురు-గ్యాస్ 2.17 శాతం, కమోడిటీస్ 2.06 శాతం, ఎనర్జీ సూచీ 1.95 శాతం ఎగిశాయి. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.71 శాతం, స్మాల్‌క్యాప్ 1.72 శాతం చొప్పున ఎగిశాయి.

### గ్లోబల్ మార్కెట్లలో..

ఆసియా మార్కెట్లలో జపాన్ 0.80 శాతం నష్టపోతే, హాంకాంగ్ 3.56 శాతం, చైనా 1.80 శాతం మేర పెరిగాయి. ఐరోపా మార్కెట్లలో జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ సూచీలూ లాభాల్లోనే కదలాడాయి. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) మంగళవారం రూ.3,115.39 కోట్ల పెట్టుబడుల్ని దేశీయ మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకున్నారు. గత శనివారం, ఈ మంగళవారాల్లో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ భారీగా నష్టపోయిన విషయం తెలిసిందే. మంగళవారం ఒక్కరోజే బీఎస్ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ రూ.8.50 లక్షల కోట్లు హరించుకుపోయిన సంగతీ విదితమే. నాడు సెన్సెక్స్ 1,053.10 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ కూడా 330.15 పాయింట్లు దిగజారింది.

# పన్ను ప్రోత్సాహకాలివ్వాలి

- దేశీయంగా బట్టల తయారీకి ఊతమివ్వండి
- రాబోయే బడ్జెట్‌పై ఏఈపీసీ విజ్ఞప్తి



కేంద్ర బడ్జెట్ ప్రక్రియ తుదిదశకు చేరిందనడానికి సంకేతంగా నిలిచే హల్వా వేడుక బుధవారం నార్త్ బ్లాక్‌లో జరిగింది. ఇందులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూఢిల్లీ, జనవరి 24: రాబోయే బడ్జెట్‌లో పన్ను ప్రోత్సాహకాలివ్వాలని దుస్తుల ఎగుమతిదారుల సంఘం ఏఈపీసీ బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దేశంలో బట్టల తయారీకి మద్దతునిచ్చేలా, ఎగుమతులు పెరిగేలా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో ఒకే శ్లాబ్, వడ్డీ రాయితీల పెంపు వంటి నిర్ణయాలు తీసుకోవాలని అప్పారెల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ) విజ్ఞప్తి చేసింది. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలోనే ఆయా రంగాల నుంచి డిమాండ్లు, విజ్ఞప్తులు, ప్రతిపాదనలు వస్తున్నాయి. ఇందులో భాగంగానే పర్యావరణ, సామాజిక, కార్పొరేట్ గవర్నెన్స్ (ఈఎస్‌జీ) తోపాటు ఇతరత్రా అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు, నిబంధనల్ని ఆచరిస్తున్న దుస్తుల తయారీదారులకు పన్ను ప్రోత్సాహకాల్ని కల్పించాలని ఏఈపీసీ కోరింది. అలాగే స్వదేశీ ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్‌కు బడ్జెట్‌లో నిధుల్ని కేటాయించాలనీ విన్నవించింది. 'ఎగుమతిదారులకు అధిక వడ్డీరేట్ల వల్ల మూలధనం సమకూర్చుకోవడం చాలా కష్టంగా మారుతున్నది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లతోపాటు పెద్ద సంస్థలకూ రుణాలపై వడ్డీరేట్లను తగ్గించాలి' అని ఏఈపీసీ డిమాండ్ చేసింది. అంతేగాక చేనేత వస్త్రాలన్నింటిపైనా జీఎస్టీని 5 శాతానికే పరిమితం చేయాలన్నది. ఫైబర్, యార్న్, ఫ్యాబ్రిక్‌పై ఇప్పుడు జీఎస్టీ రేట్లు వరుసగా 18, 12, 5 శాతంగా ఉన్నాయి. వీటన్నిటిపై 5 శాతమే జీఎస్టీ ఉండాలని ఏఈపీసీ ప్రధాన కార్యదర్శి మిథిలేశ్వర్ ఠాకూర్ కోరుతున్నారు.

### స్పేస్ ఇండస్ట్రీ నుంచి..

రక్షణ రంగ పరిశ్రమలతో సమానంగా ఉదార విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) విధానాన్ని కోరుతున్నది దేశీయ అంతరిక్ష పరిశ్రమ. వచ్చే బడ్జెట్‌లో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలనూ (పీఎల్ఐ) ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది. అలాగే శాటిలైట్లు, లాంచ్ వెహికిల్స్, గ్రౌండ్ ఎక్విప్‌మెంట్ తయారీకి జీఎస్టీ మినహాయింపుల్నీ ఇండియన్ స్పేస్ అసోసియేషన్ అడుగుతున్నది. ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్‌కు తక్కువ వడ్డీరేట్లు ఉండాలని, శాటిలైట్ రంగానికి పన్నుల్ని 10 శాతం నుంచి 2 శాతానికి దించాలనీ చెప్తున్నది. 'భారతీయ స్పేస్ ఇండస్ట్రీలోని సంస్థలు ఒక్క శాతం ఎఫ్‌డీఐ కోసం కూడా ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాలంటే నెలల తరబడి వేచి చూడాల్సి వస్తున్నది. కానీ రక్షణ రంగ సంస్థలు 74 శాతం ఎఫ్‌డీఐని ఆటోమేటిక్ మార్గం గుండానే అందుకుంటున్నాయి' అని బెంగళూరుకు చెందిన స్టార్టప్ కంపెనీ పిక్సెల్ వ్యవస్థాపక సీఈవో అవైస్ అహ్మద్ అంటున్నారు. దేశీయ స్పేస్ పరిశ్రమ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నదని, పన్నులపరమైన ఇబ్బందులూ ఉన్నాయని, వాటికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందంటూ ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్.. లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) ఏకే భట్ అంటున్నారు. కాగా, 2033 నాటికి స్పేస్ ఎకానమీ 44 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా.



## సింగిల్ చార్జ్‌తో 320 కిలోమీటర్లు

### సరికొత్త ఈవీని ప్రవేశపెట్టిన సిట్రాయిన్

చెన్నై, జనవరి 24: ఫ్రెంచ్‌కు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ సిట్రాయిన్...దేశీయ మార్కెట్లోకి నయా మాడల్‌ను పరిచయం చేసింది. న్యూ సిట్రాయిన్ ఈ-సీ3 షైన్ పేరుతో విడుదల చేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.13,18,800గా నిర్ణయించింది. సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్లు ప్రయాణించే ఈ కారు అత్యంత వేగంగా బ్యాటరీ రీచార్జి కానున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. రియర్ పార్కింగ్ కెమెరా, 15 ఇంచుల డైమండ్ కట్ అల్లోయస్, ఫ్రంట్ అండ్ రియర్ స్కిడ్ ప్లేట్స్, రియర్ వైపర్ అండ్ వాషర్, రియర్ డిఫోగర్ వంటి ఫీచర్స్‌తో ఈ నయా మాడల్‌ను తీర్చిదిద్దింది. వాహనం, బ్యాటరీ, ఏమోటర్‌పై వ్యారెంటీని పెంచుకునే అవకాశం కూడా కల్పించింది.

**2024 సిట్రాయిన్-సీ3 మాడల్ ధరలు(ఢిల్లీ షోరూంలో)**

| | |
|---|---|
| లైవ్ మాడల్ | రూ.11,61,000 |
| ఫీల్ | రూ.12,69,800 |
| ఫీల్ వైబ్ ప్యాక్ | రూ.12,84,800 |
| ఫీల్ డ్యూయల్ టోన్ వైబ్ ప్యాక్ | రూ.12,99,800 |
| షైన్ | రూ.13,19,800 |
| షైన్ వైబ్‌ప్యాక్ | రూ.13,34,800 |
| షైన్ డ్యూయల్ టోన్ వైబ్ ప్యాక్ | రూ.13,49,800 |

# సిద్ధమవుతున్న టాయ్స్ పార్క్

- కంపెనీల కోసం ప్లాట్ల అభివృద్ధి
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపూర్‌లో ఏర్పాటు చేస్తున్న బొమ్మల తయారీ పార్క్ ప్రారంభానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే దేశ, విదేశాల్లోని 16 ప్రఖ్యాత కంపెనీలకు ఇందులో స్థలాలను కేటాయించారు. మరిన్ని సంస్థలకూ ప్లాట్లు ఇవ్వనున్నారు. ఈ క్రమంలో మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తయిన వెంటనే పార్క్‌ను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం దండు మల్కాపూర్‌లోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలోనే ఈ బొమ్మల తయారీ పార్క్ కోసం 106 ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే. అందులో రహదారులు, బహిరంగ స్థలంపోగా మిగిలిన స్థలంలో 196 ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటివరకు 32 ఎకరాల్లో ప్లాట్లను 16 కంపెనీలకు కేటాయించారు. ఈ పార్క్‌తో సుమారు రూ.200 కోట్ల పెట్టుబడులు, దాదాపు 25,000 ఉద్యోగాలు వస్తాయని అంచనా.



### ముందుచూపుతో..

దేశీయ మార్కెట్‌లో లభిస్తున్న వివిధ రకాల బొమ్మల్లో అత్యధికం చైనా నుంచి దిగుమతి అవుతున్నవే. ఈ నేపథ్యంలో ముందుచూపుతో తెలంగాణను బొమ్మల తయారీకి కేంద్రంగా తీర్చిదిద్దాలని గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఎక్కడా లేనివిధంగా 106 ఎకరాల్లో టాయ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్‌కు అంకురార్పణ చేసింది. ప్రస్తుతం బొమ్మల తయారీ రంగం ఎంతో విస్తరించింది. గతంలో మాదిరి కేవలం చెక్క బొమ్మలకు పరిమితం కాకుండా ప్లాస్టిక్ టాయ్స్, సాఫ్ట్ టాయ్స్, స్టెమ్ టాయ్స్, రోబోటిక్ అండ్ ఎలక్ట్రానిక్ టాయ్స్, నాన్-టాక్సిక్ టాయ్స్, ఉడెన్ అండ్ ట్రెడిషనల్ టాయ్స్, మాంటెస్సోరీ అండ్ ఎడ్యుకేషనల్ టాయ్స్ తదితర అనేక రకాల బొమ్మలు తయారవుతున్నాయి. పిల్లలకు విద్యను, విజ్ఞానాన్ని అందించేందుకు కూడా బొమ్మలను వినియోగిస్తున్నారు. దీంతో బొమ్మల తయారీకి విస్తృత అవకాశాలున్నాయని, దేశంలో మంచి మార్కెట్ కూడా ఉందని అధికారులు చెప్తున్నారు.

## లాభాల్లోకి టాటా స్టీల్

న్యూఢిల్లీ, జనవరి 24:టాటా స్టీల్ ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లింది. గత కొన్ని త్రైమాసికాలుగా నష్టాలతో కాలంవెళ్లదీసిన సంస్థ..గత త్రైమాసికంలో రూ.522.14 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. యూరప్‌లో స్టీల్‌కు డిమాండ్ పడిపోయినప్పటికీ దేశీయంగా అధికంగా ఉండటం వల్లనే లాభాల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.2,501.95 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.57,354.16 కోట్లుగా నమోదైన ఆదాయం స్వల్పంగా తగ్గి రూ.55,539.77 కోట్లకు పరిమితమైనట్లు పేర్కొంది. అంతర్జాతీయ దేశాల్లో నిరాశాజనకంగా ఉండటం, ముఖ్యంగా చైనాలో మందకొడి పరిస్థితులు నెలకొనడంతోపాటు రాజకీయ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో కమోడిటీ ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టాయని టాటా స్టీల్ సీఈవో, ఎండీ టీవీ నరేంద్రన్ తెలిపారు. ప్రస్తుతం సంస్థకు రూ.77,405 కోట్ల రుణాలు ఉన్నాయి.

## కెనరా బ్యాంక్ లాభం 3,656 కోట్లు

- క్యూ3లో 29 శాతం వృద్ధి



న్యూఢిల్లీ, జనవరి 24: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.3,656 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,832 కోట్లతో పోలిస్తే 29 శాతం అధికమైంది. ఏడాది క్రితం రూ.26,218 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.32,334 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

- నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 9.5 శాతం ఎగబాకి రూ.9,417 కోట్లకు చేరుకున్నది.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 5.89 శాతం నుంచి 4.39 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏ కూడా 1.96 శాతం నుంచి 1.32 శాతానికి దిగొచ్చాయి.
- దేశీయంగా బ్యాంక్ డిపాజిట్లు రూ.11,66,488 కోట్లు కాగా, అడ్వాన్స్‌లు రూ.9,01,465 కోట్లుగా నమోదయ్యాయి.

## వచ్చే ఏడాది గిగా ఫ్యాక్టరీ షురూ

- అమర రాజా బ్యాటరీస్

హైదరాబాద్, జనవరి 24: వచ్చే ఏడాది చివర్లోగా తమ తొలి గిగా ఫ్యాక్టరీని ఉత్పత్తిలోకి తెస్తామన్న ఆశాభావాన్ని ఆటోమోటివ్ బ్యాటరీ తయారీ దిగ్గజం అమర రాజా బ్యాటరీస్ లిమిటెడ్ వ్యక్తం చేసింది. బుధవారం ఇక్కడ జరిగిన ఓ సదస్సులో సంస్థ అధ్యక్షుడు విజయానంద్ పాల్గొన్నారు. ఈ క్రమంలోనే గిగా ఫ్యాక్టరీ ప్రారంభానికి హైటెక్నాలజీ, భారీ పెట్టుబడి, పెద్ద మొత్తంలో అనుబంధ పరిశ్రమల అవసరం ఉంటుందన్నారు. గత ఏడాది మే నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలో అమర రాజా తమ తొలి గిగా ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇక్కడ లిథియం సెల్స్, బ్యాటరీ ప్యాక్స్‌ను తయారు చేయనున్నారు.